క్లుప్తంగా

రేపు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు



లక్ష్మీనరసింహస్వామి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల కొండపై వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రామ్‌కో సిమెంట్ ఆధ్వర్యంలో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి మహాసంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించి 41 రోజులు పూర్తయిన నేపథ్యంలో పూజలు నిర్వహించనున్నారు. అహోబిలంకు చెందిన తొమ్మిది మంది వేదపండితులు అభిషేకం, హోమం, కల్యాణం నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం మేళతాళాల మధ్య స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో గ్రామోత్సవం నిర్వహిస్తారు.

భాద్రపద మాస పూజలు



మద్దిలేటిస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సందడి

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించి, స్వామివారి ఇష్టమైన వరపూజ చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

గుంతలమయంగా నల్లబల్లి రహదారి



గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

ప్యాపిలి: ప్యాపిలి–జొన్నగిరి రహదారి గుంతలమయంగా మారింది. 2019లో టీడీపీ హయాంలో రూ.3.2 కోట్లతో ఈ రహదారిని నిర్మించారు. రహదారి నిర్మించి ఏడు సంవత్సరాలు కూడా కాకమునుపే రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలను ప్రయాణికులు కోరుతున్నారు.

భక్తులపై తేనెటీగల దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయం సమీపంలో శనివారం 15 మంది భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. వివరాలు..ం ఎమ్మిగనూరుకు చెందిన ఒకే కుటుంబ భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద వెంగమ్మ కొట్టాల వద్ద దాసంగం పెట్టేందుకు వంట చేస్తున్నారు. ఈ క్రమంలో తేనెటీగలు మాధవి, సంగీత, సరస్వతి, లత, అంపయ్య, లక్కీలపై దాడి చేశాయి. అదే సమయంలో పక్కన వెళ్తున్న ఆర్‌ఎస్ రంగాపురానికి చెందిన మరో 10 మంది భక్తులపై కూడా దాడి చేశాయి. గాయపడిన వారిని బేతంచెర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఉద్యోగుల సంక్షేమం మరిచిన ప్రభుత్వం

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో మౌలాలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల సంక్షేమంపై అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం 15 నెలల కాలంలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేకపోయిందని మండిపడ్డారు. మెరుగైన పీఆర్సీ అమలు చేస్తామని, పీఆర్సీ గడువు ముగిసినా ఇంత వరకు పీఆర్సీ నియమించలేదన్నారు. పదవీ విమరణ చేసిన ఉద్యోగులు పది నెలలుగా గ్రాట్యుటీ కూడా చెల్లించలేదన్నారు. ఎస్‌ఎస్‌సీ మూల్యాకనం విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు వెంటనే మూల్యాంకన భత్యాన్ని చెల్లించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివశంకర్, గోపాలకృష్ణ, ప్రసాదరెడ్డి, ఇక్బాల్‌బాషా పాల్గొన్నారు.

బస్సులు లేవు..
అవస్థలు తప్పవు

- బనగానపల్లె డిపో నుంచి డోన్‌కు ఆర్టీసీ బస్సుల్లేవ్
- రద్దీ ఉన్నా దృష్టి సారించని అధికారులు
- బస్సుల కొరత అంటూ మిన్నకుండిపోతున్న వైనం
- ఒకేఒక్క డోన్ డిపో బస్సుతో ప్రయాణికుల ఇక్కట్లు



కిక్కిరిసిన ప్రయాణికులు



డోన్ బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

బనగానపల్లె రూరల్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం అమలులో మాత్రం విఫలమైందన్న విమర్శలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన బనగానపల్లె నుంచి రెవెన్యూ డివిజన్ కేంద్రం డోన్‌కు బనగానపల్లె ఆర్టీసీ డిపో నుంచి ఒక్క బస్సు సర్వీస్ కూడా నడవకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాల్లో పనుల కోసం వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదు.

ఒకే సర్వీస్ గతి

డోన్ ఆర్టీసీ డిపోకు చెందిన ఒక్క బస్సే ప్రయాణికులకు ఆధారం. ఇది ప్రతిరోజూ ఉదయం 11.15 గంటలకు బనగానపల్లె నుంచి జలదుర్గం మీదుగా డోన్‌కు వెళ్తుంది. తిరుగు ప్రయాణం సాయంత్రం 4.15 గంటలకు మాత్రమే ఉంటుంది. ఒకే సర్వీస్ కావడంతో బస్సు కిక్కిరిసిపోతోంది. ఉదయం అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే బేతంచర్ల మీదుగా ప్రయాణించక తప్పదు. ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలు సహా పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు డోన్‌లో ఉండడంతో బనగానపల్లె, అవుకు మండలాల నుంచి రైతులు, విద్యార్థులు, ప్రజలు వందలాదిమంది ప్రతిరోజూ రాకపోకలు కొనసాగిస్తుంటారు. బనగానపల్లె డిపో నుంచి డోన్ రూట్‌లో ప్రత్యేక బస్సు సర్వీస్ ఏర్పాటు చేస్తే ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని ప్రయాణికులు, ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఆదాయం కూడా పెరుగుతుందని చెబుతున్నారు. అయినా ఎందుకు సర్వీస్ నడపడం లేదా అర్థం కావడం లేదని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే బనగానపల్లె డిపో నుంచి డోన్‌కు కొత్త సర్వీస్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి



బనగానపల్లె ఆర్టీసీ డిపో నుంచి కూడా డోన్‌కు బస్సు సర్వీస్ ఉంటే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ఒకే ఒక్క సర్వీస్ ఏమాత్రం సరిపోవడం లేదు. నిత్యం రద్దీగా ఉంటోంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.
–వడ్డె సుబ్బరాయుడు, నందవరం

రైతులు, ప్రజలకు ఇబ్బందిగా ఉంది



డోన్ పట్టణంలో ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలు ఉన్నాయి. బనగానపల్లె, అవుకు మండలాల నుంచి రైతులు, ప్రజలు తరచూ అక్కడికి వెళ్లాల్సి వస్తుంది. కానీ బస్సు సర్వీస్ లేక ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనాలపై ఆధారపడుతున్నారు. డిపో నుంచి డోన్ రూట్‌లో బస్సు సర్వీస్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
–రాముడు, గిరిజన సమాఖ్య నాయకుడు

ఫిర్యాదులు వస్తే పరిశీలిస్తాం

డోన్ రూట్‌లో బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని ప్రయాణికుల నుంచి ఇంతవరకు ఎలాంటి రిక్వెస్ట్ లేదా ఫిర్యాదు రాలేదు. ప్రజల నుంచి వినతులు వస్తే సర్వీస్ ఏర్పాటు చేయడంపై పరిశీలిస్తాం.
–రవికిశోర్, ఆర్టీసీ డీఎం, బనగానపల్లె

వరుస దొంగతనాలు.. గ్రామస్తుల్లో భయం

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో దొంగతనాల పరంపర ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 11న అర్ధరాత్రి ఆరు ఇళ్లలో దొంగతనాలు జరగగా, అది మరువక ముందే శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మరో ఇంటిపై దొంగలు పడ్డారు. గ్రామానికి చెందిన మహేంద్ర ఇంటిపై ఉన్న గది తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించగా, దొంగలకు ఏమీ దొరకలేదు. దీంతో కింద ఉన్న ఇంటి తాళాలు పగులగొట్టారు. ఆ సమయంలో శబ్దం విని బయటకు వచ్చిన మహేంద్రను గమనించి దొంగలు పరుగులు తీశారు. వెంటనే గ్రామస్తులను అప్రమత్తం చేయగా, వారు బలపాలపల్లె పంట పొలాల వైపు పారిపోతున్న దొంగలను చూశారు. గ్రామంలో ఎప్పుడూ లేని విధంగా వరుస ఘటనలతో ప్రజల్లో భయాందోళన నెలకొంది.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఆంధ్రా చెస్ సంఘం, నంద్యాల జిల్లా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ బ్లిట్స్ విభాగాల్లో చెస్ పోటీలను శనివారం ప్రారంభించినట్లు నంద్యాల జిల్లా సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ బ్లిట్స్ టోర్నమెంట్ మునినాగలక్ష్మి, రాజేష్ తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సోమేల నాగరాజు, జనార్దన్, డాక్టర్ నీల ప్రసాద్, టోర్నమెంట్ నిర్వాహకులు సుజాత పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 403 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి ప్రతిమ

బనగానపల్లె రూరల్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ప్రతిమ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఇందులో వివిధ విభాగాలకు చెందిన 403 కేసులు పరిష్కరించబడ్డాయని కోర్టు సిబ్బంది తెలిపారు. ఇందులో ఓఎస్ మనీ కేసులు 3 పరిష్కరించి రూ.21,28,632 వసూలు చేశారు. ఈపీ కేసులు 2 క్లియర్ చేసి రూ.3,07,968, ఎన్‌ఐ యాక్ట్–1 పరిష్కరించి రూ.2,47,580, అడ్మిషన్ సీసీ కేసులు 47 పరిష్కరించి రూ.4,700 రికవరీ చేశారు. ఎస్‌టీసీ కేసులు 231 పరిష్కరించి రూ.50,800, ఎక్సైజ్ కేసులు 24 పరిష్కరించి రూ.57,110 రికవరీ చేసినట్లు వెల్లడించారు. అలాగే పీఎల్‌సీ కేసులు 64 పరిష్కరించి రూ.82,73,400 వసూలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు ప్రకాష్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు అబ్దుల్‌ఖైర్, టీఆర్ జగన్నాథ్‌రెడ్డి, అజాంహుస్సేన్, రఘురామిరెడ్డి, నరసింహారెడ్డి, విక్రమ్, భాస్కర్, చెన్నప్ప, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు ప్రశంసనీయం



ఉత్సవ నిర్వాహకులకు నగదు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ

బేతంచెర్ల: ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలను యువకులు సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసి కొత్త ఒరవడిలో నిర్వహించారని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. గత నెల 30న బేతంచెర్ల పట్టణంలో జరిగిన వినాయక నిమజ్జన ఊరేగింపులో డీజేలు లేకుండా కోలాటం, చెక్కభజన, వివిధ వేషధారణలతో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక శ్రీనగర్ కాలనీలోని షాదిఖానాలో కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ, ముస్లింలతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ హరిస్వామి, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రమేష్ బాబు ఉత్సవ నిర్వాహకులను సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. సంప్రదాయబద్ధంగా ఘర్షణలు లేకుండా విజయవంతంగా ఉత్సవాలు జరపడం ప్రశంసనీయం అని డీఎస్పీ తెలిపారు.

శక్తియాప్‌తో తక్షణ రక్ష



శక్తి యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

డోన్ టౌన్: అత్యవసర సమయాల్లో శక్తి యాప్ ఉపయోగించడం ద్వారా తక్షణ పోలీసు రక్షణ పొందవచ్చని హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి, శక్తి టీం మహిళా పోలీసు లక్ష్మీ తెలిపారు. శనివారం గుత్తి రోడ్డులోని రైల్వే స్టేషన్ సమీపంలో మహిళలు, బాలికలకు ప్రయాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి ఎలాంటి తినుబండారాలు, పానియాలు స్వీకరించరాదని సూచించారు. శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర సమయాల్లో వినియోగించుకోవాలని, ఆ యాప్ వాడే విధానాన్ని వివరించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో 100, 112 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. స్మార్ట్ ఫోన్‌లో తెలియని యాప్ లింక్‌లను డౌన్‌లోడ్ చేయరాదని, సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సలహా ఇచ్చారు.

వానొస్తే నీటి మడుగే!



పోస్టాఫీసు సమీపంలో రోడ్డుపై చేరిన వర్షపు నీరు (ఫైల్)

కొలిమిగుండ్ల: భారీ వర్షం కురుస్తే చాలు మండల కేంద్రం కొలిమిగుండ్లలోని పలు కాలనీల ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ పెద్ద ఎత్తున కాలనీల్లోకి నీరు చేరడంతో అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగాన ఉన్న నాలుగు కాలనీల్లో మూడు అడుగుల మేర నీరు నిల్వ చేరుతుంటాయి. కొందరి ఇళ్లలోకి సైతం చేరుతున్నాయి. పోస్టాఫీసు నుంచి రామసుబ్బారెడ్డి ఆస్పత్రి వరకు ప్రధాన సీసీరోడ్డుపై ఇదే పరిస్థితి నెలకొంటుంది. ఇళ్ల ముందు పార్కింగ్ చేసుకున్న బైక్‌ల్లోకి వర్షపునీరు చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎగువ నుంచి నీరు పోలీస్ స్టేషన్ మీదుగా పలు కాలనీల్లోకి చేరుతుంటాయి. వరదనీరు కాలనీల్లోకి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన అజయ్, బన్నీ నాయక్

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని బుగ్గానిపల్లె రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..ం బేతంచెర్ల దుర్గాపేట కాలనీకి చెందిన అజయ్, బుగ్గానిపల్లె తండాకు చెందిన బన్నీ నాయక్ ద్విచక్ర వాహనంపై బేతంచెర్ల వైపు వస్తుండగా అయ్యప్పస్వామి ఆలయం వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తల, కాళ్లపై తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానిక శేషారెడ్డి ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పీపీపీలో వైద్యకళాశాలల నిర్మాణం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

డోన్ టౌన్: వైద్య కళాశాలల్లో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని, వాటిని ప్రభుత్వమే నిర్మించి నిర్వాహణ బాధ్యతలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైద్య విద్య పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సాధారణ విద్యలో 50 శాతంపైగా ప్రైవేటీకరణ జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలోని పది వైద్య కళాశాలలకు అదనంగా కేంద్రం మరో 17 కళాశాలలను కేటాయించిన విషయం గుర్తు చేసి, వీటి నిర్మాణంలో 60 శాతం నిధులు కేంద్రం భరిస్తే 40 శాతం కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించలేని స్థితిలో ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీని ప్రైవేట్ పరం చేశారని, పీపీపీ విధానం వల్ల పేదలకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుందని విమర్శించారు. ఈ విధానాన్ని ఉపసంహరించుకోకపోతే భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



బనగానపల్లెలో సాగులో ఉన్న వరి పంట

యూరియా కొరత..
రైతుల వెత

బనగానపల్లె: మండల రైతులు ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. అయితే పంటల పెరుగుదలకు అవసరమైన యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సుమారు 11,500 హెక్టార్లలో సాగు జరుగుతుండగా, అందులో 4 వేల హెక్టార్లలో వరి, 3,800 హెక్టార్లలో మొక్కజొన్న, అలాగే పత్తి సహా మరికొన్ని పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలకు మూడుబస్తాల యూరియా అవసరమని రైతులు చెబుతున్నారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా ప్రతి పట్టాదారు పాస్‌బుక్‌కు కేవలం రెండు బస్తాలకే పరిమితం చేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ భూమి ఉన్నా రెండు బస్తాలకే పరిమితం చేయడం శోచనీయమని రైతులు అంటున్నారు. వాటికి కూడా గంటల తరబడి ఆర్ఎస్‌కేల వద్ద ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. సీజన్ దాటిన తర్వాత యూరియా సరఫరా ఉపయోగం ఉండదని, తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వల్లంపాడు సమీపంలో చిన్నవంచెవాగులో పూర్తిగా తగ్గిపోయిన వరద

తగ్గిన వరద

- రాకపోకల పునరుద్ధరణ

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిశాయి. భారీ వర్షాలతో కోవెలకుంట్ల–లింగాల ఆర్అండ్‌బీ రహదారిలోని చిన్నకొప్పెర్ల, వల్లంపాడు సమీపాల్లో కైప, నల్ల, చిన్నవంచెవాగులు ఉప్పొంగి ప్రవహించడంతో ఈ రహదారిలో రెండు రోజులపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి వరుణుడు శాంతించడంతో ఈ రహదారిలో శనివారం నుంచి రాకపోకలు సాగాయి. కోవెలకుంట్ల, కలుగొట్ల, వల్లంపాడు, గుళ్లదూర్తి గ్రామాల సమీపాల్లో ప్రవహిస్తున్న కుందూనదిలో వరద ఉధృతి కాస్త తగ్గడంతో వరద ముప్పు నుంచి నదీతీర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



కోవెలకుంట్ల: కుందూనదిలో తగ్గిన వరద ఉధృతి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ టౌన్ ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



ముదిగేడు గ్రామంలో నీటమునిగిన వరిపంట



ముదిగేడులో ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు వాగు

వర్ష బీభత్సం

సంజామల: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు సంజామల, అవుకు మండలాల్లో వాగులు వంకలు ఉప్పొంగాయి. పాలేరు వాగు ఉధృతి రెండు రోజులుగా తగ్గకపోవడంతో కోవెలకుంట్ల–అవుకు, కోవెలకుంట్ల–తిమ్మినాయినిపేట మార్గాల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. అవుకు మండలంలోని శివవరం, హోత్రమాన్ దిన్నె, కమలపురి, ముదిగేడు, ముచ్చలపురి, సంజామల మీదుగా ప్రవహిస్తున్న పాలేరు వాగులో వరద నీరు శనివారం కూడా తగ్గకపోవడంతో వరి పంటలు నీటమునిగాయి. పంట తీవ్రంగా దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపు 700 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు నష్టపోయాయని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.